క్లుప్తంగా

నర్సరీల ఏర్పాటుకు దరఖాస్తు

బల్లికురవ: బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లో రైతులు నారుమళ్ల పెంపకానికి 120 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని మార్టూరు ఉద్యానవన శాఖాధికారి జీ. హనుమంతనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంత గతంలోనే దరఖాస్తుతో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారని కొత్తగా ఏర్పాటు చేయదలచిన వారు తమ శాఖ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా నర్సరీల ద్వారా నారుమళ్ల పెంపకం చేపట్టడం నేరమన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీకాలేజీలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ (ఎంకామ్) కోర్సులలో సబ్జెక్టులను బోధించేందుకు అర్హత గలిగిన గెస్ట్ ఫ్యాకల్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్–2, స్టాటిస్టిక్స్–1, బోటనీ–2, కామర్స్–1, మైక్రోబయాలజీ–1, తెలుగు–1, గ్రంథాలయం–1, కంప్యూటర్ అప్లికేషన్–1 సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు నెట్/సెట్/ పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలను మంగళవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

విద్యుత్ కోతలతో అల్లాడుతున్న జనం

అద్దంకి: అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. పట్టణంతోపాటు, పల్లెల్లో చిటికి మాటికి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. రోజులో పది నుంచి పన్నెండు సార్లు పావు గంట మొదలుకొని, గంట వరకు సరఫరా నిలిచిపోతోంది. నిన్నటి వరకు ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు అప్రకటిత విద్యుత్ కోతలతో మరింత ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మొన్న పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో ఇదే విధంగా నిన్న రెండు, మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోడంతో ప్రజలు ఆందోళన చెందారు. విద్యుత్ శాఖ అధికారులు కోతలు విధిస్తున్నారా ? లేక ఎందుకు ఇలా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందో తెలియకుండా పోతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడానికి గల కారణాలను అధికారులు తెలియజేయాలని కోరుతున్నారు. ఈవిషయమై విద్యుత్ శాఖ డీఈని వివరణ కోరగా మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని చెప్పారు.

రాతిముఖ మండప నిర్మాణానికి విరాళం


ఏసీ సుభద్రకు విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి అద్దంకికి చెందిన ఆలపాటి లక్ష్మీ నారాయణ, సతీమణి పద్మావతి రూ. 101116ను విరాళంగా దేవస్థాన ఏసీ టీ. సుభద్రకు సోమవారం అందజేశారు. దేవస్థాన అభివృద్ధికి సహకారం అం

వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ


చార్టెడ్ ఎకౌంటెంట్‌ను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: వాసవీ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్‌డే, చార్టెడ్ ఎకౌంటెంట్ డే సందర్భంగా పట్టణంలోని డాక్టర్ గొట్టిపాటి సత్యనారాయణ, ఎకౌంటెంట్ కోట శ్రీనివాసకుమార్‌ను ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ సభ్యుడు తమ్మన శ్రీనివాసరావు పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ప్రెసిడెంట్ ఉడత్తు వెంకట ఆదినారాయణ, జోన్ చైర్మన్ ఆత్మకూరు పెద్ద ఆంజనేయులు, ఊటుకూరు ఉమా అన్నపూర్ణ, వనిత ప్రెసిడెంట్ విజయలక్ష్మి, సెక్రటరీ ఎస్ అంజలి, వాసవి సభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, అశ్వని నక్షత్రం, దశమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అతిసార నుంచి సమాజాన్ని కాపాడుదాం


స్వర్ణలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు


పంగులూరు పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య శిబ్బంది

స్వర్ణ (కారంచేడు): ప్రజలను పట్టి పీడిస్తున్న అతిసార వ్యాధి నుంచి సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందిరిపై ఉందని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాలినీ అన్నారు. సోమవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిసార వ్యాధిపై వాల్‌పోస్టర్, కరపత్రాలు, బ్యానర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె అతిసార వ్యాధి ఎలా నివారించుకోవాలో తెలియజేశారు. చిన్నబిడ్డలకు ఒక రోజులో మూడు సార్లు అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరేచనాలు అయితే దీనిని అతిసార వ్యాధి లక్షణంగా చూడాలన్నారు. దీని నుంచి ఉపసమనం పొందేందుకు ఓఆర్ఎస్, విటమిన్ ఏ సిరప్‌ను తాగించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించాలన్నారు. భోజనానికి ముందు, మరుగుదొడ్లు వినియోగించిన తరువాత తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లిపాలు తాగకపోవడం, ప్రతిదీ వాంతి చేసుకోవడం, పలుచని మల విసర్జన తరువాత నిర్జలీకరణ, అనారోగ్యానికి గురవ్వడం, మలంలో రక్తం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అతిసార వ్యాధిపై ప్రధానంగా లోతట్టు ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హస్మప్రియ, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, హెచ్ఈఓ నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార వ్యాధి నుంచి అప్రమత్తత అవసరం..

జే.పంగులూరు: అతిసార వ్యాధిపట్ల చిన్నారుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మలేరియాను పారదోలేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని, పంగులూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు శివచెన్నయ్య అన్నారు. మలేరియా, అతిసార వ్యాధిపట్ల సోమవారం పంగులూరు పీహెచ్‌సీ నుంచి గ్రామంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు మలేరియా వ్యాధి పట్ల అవగాహన కలిగించేందుకు ఆరోగ్య సిబ్బంది అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మలేరియా పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధ్యూబాబు, పీఎం జ్యోతి ప్రసాద్‌బాబు, సీసీలు సాల్మన్, దాసు, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమోహన్


మాట్లాడుతున్న నూతన ప్రెసిడెంట్

అద్దంకి రూరల్: రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ చదలవాడ ఫణీంద్రబాబు సమక్షంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ నూతనకార్యవర్గ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2023-2024 క్లబ్ ప్రెసిడెంట్ చిన్ని మురళీకృష్ణ, నూతన ప్రెసిడెంట్ చప్పిడి వీరయ్యకు రోటరీ కాలర్ సమర్పించారు. నూతన సెక్రటరీగా చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్‌గా మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్‌గా షేక్ మహమ్మద్ రఫీ నియమితులైయ్యారు.

చినగంజాం (పర్చూరు): పర్చూరు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దేవరపల్లికి చెందిన తోకల కృష్ణ మోహన్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం స్థానిక రోటరీ భవన్‌లో జరిగిన 2024–2025 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శిగా కోమటి ఆంజనేయులు, కోశాధికారిగా సదానంద రెడ్డి కూడ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథి జాష్టి రంగారావు, రోటరీ ప్రముఖులు అన్నె రత్నప్రభాకర్, ఎమ్ హరిహర ప్రసాద్, ఎల్ రఘురామి రెడ్డి, దినేష్ రెడ్డి, కె రామకోటయ్య, తేళ్ల రమేష్ చంద్ర పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం


చేతుల పరిశుభ్రతపై అవగాహప కల్పిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని గుంటుపల్లి పీహెచ్‌సీ అధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. సోమవారం మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో 104 శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాల సీజన్ ఆరంభమైనందున ప్రభుత్వం డయేరియా ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రెండు నెలలపాటు గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిన ఆదేశించారు. ఐదేళ్ల చిన్నారులకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లుచెప్పారు. చేతుల పరిశుభ్రతపై తల్లులు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలల వారీగా అవగాహన కల్పిస్తామని సురక్షిత మంచి నీరు తాగాలని వైద్యాధికారి కోరారు.

బోధన నైపుణ్యంపై ఉపాధ్యాయులకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్రామయ్య

చినగంజాం (పర్చూరు): బోధన నైపుణ్యంపై ఉపాధ్యాయులకు స్థానిక ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు ఎంఈఓ వెంకట్రామయ్య, చీరాల ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు విద్యార్థులకు ఏ విధంగా పాఠాలు చెప్పాలో వివరించారు. టూల్స్ ని ఉపయోగించి విద్యార్థులకు బోధన చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, చీరాల ఉప విద్యాశాఖాధికారి నిర్మల సందర్శించారు. శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వై ఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఈదర రాజశేఖర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న శివశంకర్

వేటపాలెం: కఠారివారిపాలెంలోని మండల పరిషత్ స్కూల్ క్రీడా మైదానంలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న కళావేదిక (స్టేజీ) నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాగవత్ భక్తి సేవా ట్రస్ట్ చైర్మన్ శివశంకర్ పాల్గొని భూమి పూజ చేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వెనకబడిన ప్రాంత విద్యార్థులలో మనోవికాసం, మానసిక ఉల్లాసం పెంపొందించుటకు అనుకూలంగా స్టేజీ నిర్మిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మి ప్రసాద్, శేఖర్, బుర్రా సాంబశివరావు, ప్రతి శరత్ బాబు, బద్రిరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

- సర్వర్ అందక పెన్షన్ పంపిణీలో కొంత జాప్యం
- లబ్ధిదారుల అడ్రస్ కోసం ఉద్యోగుల ఇక్కట్లు


దివ్యాంగుడికి పెన్షన్ అందజేస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి


చీరాలలో పెన్షన్ నగదును అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల అర్బన్: ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వం అందించే పెన్షన్లను నూతనంగా కొలువుతీరిన ప్రభుత్వం సోమవారం ప్రారంభించింది. ఉదయం 6గంటల నుంచే పట్టణంలో పెన్షన్ల పంపిణీని ప్రారంభించారు. వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు సహకారంతో పట్టణంలో పెన్షన్ పంపిణీని చేపట్టారు. ఉదయం సమయంలో ఆన్‌లైన్ సర్వర్ సక్రమంగా లేకపోవడంతో పెన్షన్ పంపిణీలో కొంత జాప్యం ఏర్పడింది. ఒక్కో ఇంటి వద్ద నిమిషాల కొద్ది సమయం పట్టడంతో పంపిణీ ఆలస్యమైంది. దీంతో పెన్షన్‌దారులు ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది కోసం ఎదురు చూపులు చూశారు. అలానే పెన్షన్‌దారుల అడ్రస్సులు తెలియకపోవడంతో వారి అడ్రస్ కోసం వెతుక్కునేందుకు సమయం పట్టింది. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు చెప్పిన విధంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి రూ.3 వేలు, పెంచిన పెన్షన్ రూ.4 వేలు కలిపి రూ.7 వేలు పెన్షన్‌ను అందించారు. చీరాల అర్బన్‌లో అన్ని పెన్షన్లు కలిపి 8,320 ఉండగా రూ.5.72 కోట్లు నగదును పెన్షన్ రూపంలో అందించారు.

జే. పంగులూరు: రాష్ట్రమంతా విజయవంతంగా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొండ మంజులూరు గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న గుంజి రమణయ్య కుమారులు దివ్యాంగులైన గుంజి వెంకట విజయ్, గుంజి భానుప్రకాష్ ల ఇంటికి వెళ్లి మంత్రి రవికుమార్ ఇద్దరికి పెన్షన్ డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, మాజీ డైరీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

- చీరాల పట్టణ, వేటపాలెం, చీరాల మండలాల్లో సోమవారం ప్రారంభమైన పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరయ్యారు. స్వయంగా ఆయనే పెన్షన్ నగదును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, పంచాయితీలలో సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు.

మేదరమెట్ల/బల్లికురవ/అద్దంకి రూరల్/కొరిశపాడు: ఉదయం నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. కొరిశపాడు మండలంలో పింఛన్ల సొమ్మును నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీవో సమతవాణి ఈవోపీఆర్‌డీ ఓబులేష్, ఈవో లక్ష్మీకాంత్ పర్యవేక్షించారు.

- ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం సాయంత్రంలోపు పంపిణీ పూర్తిచేయాలని బల్లికురవ ఎంపీడీవో వై హనుమారెడ్డి, తహసీల్దార్ ఎం సుభద్ర సెక్రటరీలు, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీవో హనుమారెడ్డి, పీఆర్ డీఏ పీడీ రాజేష్, ఈవోఆర్డీ సుమతి, పంచాయతీరాజ్ ఏఈ జీ. హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ వీరాంజనేయులు పర్యవేక్షణతో పంపిణీ చేపట్టారు. అద్దంకి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది లబ్దిదారులకు పంపిణీ చేశారు.
- కారంచేడు, ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీవో బీ బాబూరావు ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. యద్దనపూడి మండలంలో 4967 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివసుబ్రమణ్యం తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ కె. కరుణ, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. మార్టూరు మండలంలో ఎంపీడీవో జి నితిన్, పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు.

ఇళ్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పించాలి


చీరాల ఆర్డీవోకు వినతిపత్రాలను అందిస్తున్న బాధితులు

చీరాల టౌన్: వాడరేవు–పిడుగురాళ్ల 16 ఏ హైవే నిర్మాణంలో భాగంగా చాలామంది పేదలు నివాసం ఉండే ఇల్లు కోల్పోతున్నారని.. పేదల ఇళ్లను కోల్పోయేవారికి పునరావాసం, ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగాంగా ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్ కాలనీలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలు ఇళ్లు కోల్పోవడంతో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బాధితులతో కలిసి నాయకులు కొండయ్య, బాబూరావులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి సిండికేట్ వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు కనీసం నోటీసులు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు ఇళ్లను తొలగించాలని పొక్లెయిన్లతో వచ్చి భయపెడుతున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రాలను అందించారు. తమ బాధలను చెప్పుకునేందుకు వెళ్లిన చీరాల తహశీల్దార్ నాసరయ్య బాధ్యతారహితంగా మాట్లాడి తమను కించపరిచేలా వాఖ్యలు చేశారని ఆర్డీవోకు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాదితులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు శ్రీనివాసరావు, ఇస్సాకు, వెంకటేశ్వరమ్మ, అనిత, సీతమ్మ, రాణి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి


పార్వతమ్మ (ఫైల్)

జే.పంగులూరు: మండల పరిధిలోని నూజిళ్లపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ మద్దినేని పార్వతమ్మ (77) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఆదివారం పార్వతమ్మకు ఒక్కసారిగా గుండెపోటు రాగా, కుటుంబ సభ్యులు హుటాహుటినా ఒంగోలు ప్రవేటు వైద్యశాలకు తరలించారు. ఆదే రోజు రాత్రి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న విజ్ఞప్తుల కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కె.నాసరయ్య సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, తదితర అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్, వీఆర్వోలు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలు వృద్ధి సాధించాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకొని వృద్ధిలోకి రావాలని ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. సోమవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గూపు విధిగా ప్రతినెల 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని, ఉన్నతమైనదని తహశీల్దార్ డీ నాసరయ్య అన్నారు. సోమవారం స్థానిక ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసిన పావళ్ల శివవరప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ నాసరయ్య హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల వైఖరి, ప్రవర్తన, ఆదర్శాలు సమాజానికి మార్గనిర్దేశం చేస్తాయన్నారు. ఉపాధ్యాయులుగా జీవితాన్ని ఆరంభించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసలు అందుకున్న సర్వేపల్లి రాధాకృష్ణన్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వంటి వారు ఉపాధ్యాయ వర్గానికి ప్రతిరూపాలు, ఆదర్శమూర్తులని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు శివవరప్రసాద్ దంపతులను ఎంఈఓలు పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణిలు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్, ఉపాధ్యాయులు కె.రాజేంద్రప్రసాద్, వై.గాంధి, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, చంద్రశేఖర్, కె.సుశీల, కృష్ణమోహన్, మోహన్ కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారికి సర్పంచ్ ఫిర్యాదు

మార్టూరు: సర్పంచ్ పేరు కనిపించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని జిల్లా పంచాయతీ అధికారికి ఓ మహిళా సర్పంచ్ ఫిర్యాదు చేసింది. మండలం బొబ్బేపల్లి గ్రామ సర్పంచ్ తాళ్లూరు లావణ్య సోమవారం జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీఓ, ఈఓఆర్డీలకు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి వై సీతారావమ్మ వివరాల మేరకు.. గ్రామ సచివాలయ పంచాయతీ కార్యాలయంపై గతంలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుగా విజయం సాధించిన సర్పంచ్ తాళ్లూరు లావణ్య పేరు ఉండేది. సోమవారం ఉదయం గ్రామ సర్పంచ్ పేరు కనిపించకుండా దానిపై నూతనంగా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ఫోటోలతో స్థానిక నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన సర్పంచ్ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా స్థానిక నాయకులు ఏర్పాటు చేశారని తానేమి చేయలేనని సమాధానం చెప్పినట్లుగా లావణ్య విలేకరులకు తెలిపారు. ఫ్లెక్సీలు ఎవరైనా ఏర్పాటు చేసుకోవచ్చని కానీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన ఓ మహిళా సర్పంచ్ పేరు పంచాయతీ కార్యాలయంపై కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ఆవేదన వెలిబుచ్చారు. ఈవిషయమై జిల్లా పంచాయతీ అధికారికి ఎంపీడీవో, యూఈఆర్డీలకు ఫిర్యాదు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ లావణ్య తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సీతారావమ్మను వివరణ కోరగా గ్రామ సర్పంచ్ పేరు కనిపించకుండా ఫ్లెక్సీ స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన మాట నిజమేనని అన్నారు.

కనిపించే దేవుళ్లు మన వైద్యులు


వైద్యులను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


ప్రభుత్వాసుత్రిలో అన్నదానం నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


వైద్యురాలు సుభాషిణిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ఆపదలో అభాగ్యులను అక్కున చేర్చుకుని వారికి కావాల్సిన అన్ని వైద్య సదుపాయాలను అందించి వారిని మంచి ఆరోగ్యవంతులుగా దీర్చిదిద్దేవారే వైద్యులని వారే కనిపించే దేవుళ్లని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూలు, డాక్టర్స్ డేను పురస్కరించుకుని చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రోటరీ సామాజిక భవనంలో పట్టణంలోని పలువురు వైద్యులను డాక్టర్ ఐ. బాబురావు, సతీష్‌కుమార్, పుల్లారావు, శంకర రెడ్డి, కొండలరావు, పున్నారావు, డాక్టర్ రాధిక, ఆడిటర్ సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. అనంతరం హాజరైన సభ్యులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. వాకర్స్ అసోసియేషన్ సెక్రటరి చారుగుళ్ల గురు ప్రసాద్ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాసుపత్రిలో బాలింతల వెంటవచ్చినవారికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, చారుగుళ్ల గురు ప్రసాద్, నారాయణ మూర్తి, వాకింగ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యులను సన్మానించడం మన బాధ్యత

చీరాల టౌన్: వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మనుషుల్ని బతికించే ఓ మహాశక్తిగా ప్రజలను సేవ చేస్తున్న వైద్యులను సన్మానించడం మన అందరి బాధ్యత అని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిపావని అన్నారు. సోమవారం డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణ స్కూల్లో వేడుకలను నిర్వహించారు. చీరాల ఏరియా వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణిని వైద్యుల దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.